## సత్యవతి మృతి పట్ల తాతా మధు సంతాపం

ఖమ్మం, అక్టోబర్ 16: భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి మరణం పట్ల దిగ్భ్రాంతికరమని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సత్యవతి మరణం భద్రాచలం ప్రాంత ప్రజలకు తీరనిలోటని అన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మంత్రి సతీమణి ఇంటింటి ప్రచారం



ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందిస్తూ ప్రచారం చేస్తున్న మంత్రి సతీమణి

ఖమ్మం, అక్టోబర్ 16: బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థిగా తన భర్త పువ్వాడ అజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి పువ్వాడ వసంతలక్ష్మి సోమవారం ఖమ్మం 13వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి తన భర్త చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కరపత్రాలను అందజేసి అభివృద్ధి గురించి వివరించారు. ఖమ్మంలో మరింత అభివృద్ధి జరగాలంటే అజయ్ కుమార్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ నీరజ, నాయకురాళ్లు కొల్లు పద్మ, షకీనా తదితరులు పాల్గొన్నారు.

## ‘అజయ్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి’



29వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎర్రా అప్పారావు

ఖమ్మం, అక్టోబర్ 16: బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌ను గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ 29వ డివిజన్ అధ్యక్షుడు ఎర్రా అప్పారావు కోరారు. అజయ్‌కు అధిక మెజార్టీ అందించాలని కోరారు. ఆ డివిజన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అజయ్ తోనే ఖమ్మం అభివృద్ధి సాధ్యమైందని అన్నారు. ఇప్పటివరకు జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని కోరారు. సీఎం కేసీఆర్ ఖమ్మానికి అధిక నిధులు ఇచ్చారని అన్నారు. కారు గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. డివిజన్ నేతలు పాల్గొన్నారు.

## ‘పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి’

రఘునాథపాలెం, అక్టోబర్ 16: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఖమ్మం 2, 4 డివిజన్ల బీఆర్ఎస్ బూత్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి గురించి ప్రతి ఒక్కరికీ వివరించాలని సూచించారు. అనంతరం 4వ డివిజన్‌లో దసరా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. పార్టీ నాయకులు నర్రా ఎల్లయ్య, కుర్రా మాధవరావు, చిలుమూరు కోటి, షేక్ రజీం, షేక్ వలీ, హెచ్ ప్రసాద్, తంగెళ్లపల్లి శ్రీను, సతీశ్ గౌడ్, రాజేందర్, మదార్, ఉపేంద్రాచారి, కొట్టే నాగేంద్రబాబు, కొండల రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్

# ఓడేది కాంగ్రెస్సే.. గెలిచేది బీఆరెస్సే..

- ఎవరెన్ని కుట్రలు చేసినా ఈ ఎన్నికల్లో జరిగేది ఇదే..
- నేను లేని టైం చూసి గజదొంగల్లా ఖమ్మంలో దూరారు..
- సోషల్ మీడియాలో పోస్టులు పెట్టగానే ఏమీ అయిపోలేదు..
- బీఆర్ఎస్‌లో చేరికల సభలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- పారా ఉదయ్ ఆధ్వర్యంలో 200 మంది బీఆర్ఎస్‌లో చేరిక



గులాబీ కండువా కప్పి ఉదయ్‌ని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి అజయ్

ఖమ్మం, అక్టోబర్ 16: ఎవరెన్ని ఎత్తులు వేసినా ఓడేది కాంగ్రెస్సేనని, విజయతీరాన్ని తాకేది బీఆరెస్సేనని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఎంత మంది వచ్చి ఎన్నిక కుట్రలు పన్నినా ఈ ఎన్నికల్లో జరిగేది ఇదేనని తేల్చిచెప్పారు. నేను లేని టైంలో, బీ ఫాం తీసుకోవడానికి నేను హైదరాబాద్ వెళ్లిన సమయంలో కొందరు కుట్రదారులు ముఠాగా ఏర్పడి గజదొంగల్లా ఖమ్మంలో దూరారని ఆరోపించారు. అంతేగాకుండా కొందరిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నామంటున్నారని, అలా చెప్పుకున్నంత మాత్రాన, సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టుకున్నంత మాత్రాన వారు గెలిచినట్టు కాదని స్పష్టం చేశారు. ఖమ్మానికి చెందిన యువ నాయకుడు పారా ఉదయ్ అధ్వర్యంలో సోమవారం ముస్తాఫానగర్ సెంటర్ నుంచి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పారా ఉదయ్‌తోపాటు 200 మంది యువతీ యువకులు మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పారా నాగేశ్వరరావు, పారా శ్రీనివాస్, సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో కలిసి మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. గతంలో తన మీద పోటీ చేసిన వారినే ఓడించానని, ఇప్పుడు మళ్లీ ఓడిస్తానని, అదేం పెద్ద విషయం కాదని వివరించారు. రానున్న రోజుల్లో అదే జరుగుందని స్పష్టం చేశారు. యువత భవితకు గొప్ప వేదిక బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. అందుకని యువతీ యువకులు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని అన్నారు.

**మా పేర్లు ప్రస్తావిస్తే ఊరుకునేది లేదు: మేయర్, డీసీసీబీ చైర్మన్**

కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం మాట్లాడుతూ.. ఖమ్మం నగరాభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పని చేసిన మంత్రి పువ్వాడ వెంటే నడుస్తామని, ఖమ్మాన్ని తీర్చిదిద్దిన బీఆర్ఎస్ తోనే ఉంటామని స్పష్టం చేశారు. తాము కాంగ్రెస్‌లోకి వెళ్తున్నామంటూ తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. అందులో తన పేరును ప్రస్తావిస్తే సహించబోనని మేయర్ తేల్చి చెప్పారు. టీ కోసం వస్తున్నామంటూ ఫోన్లు చేస్తున్నారు, వారు టీ తాగాలనుకుంటే బయట చాలా షాపులు ఉన్నాయని, అక్కడికెళ్లి తాగొచ్చు కానీ తమ ఇంటికి మాత్రం రావొద్దని హితవుచెప్పారు. సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్లు మక్బూల్, నాయకులు అమరగాని వెంకటేశ్వర్లు, పొన్నం వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

## హ్యాట్రిక్ విజయాన్నివ్వండి..



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 16: ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని మంత్రి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కేసీఆర్‌కు హ్యాట్రిక్ సీఎంగా, తనకు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. ఖమ్మం 54వ డివిజన్ వీడీవోస్ కాలనీలో ఆడిటర్ శివరామ కృష్ణ ప్రసాద్ అధ్వర్యంలో సోమవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. ఖమ్మం అభివృద్ధికి తట్టెడు మట్టి పోయనివాళ్లు కూడా ఇప్పుడు ఇక్కడి ప్రజలను ఓట్లు అడగడానికి వస్తున్నారని అన్నారు. అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, వివిధ సంఘాల నాయకులు కూరాకుల నాగభూషణం, ఆర్‌జేసీ కృష్ణ, కర్నాటి కృష్ణ, చెరుకూరి కృష్ణమూర్తి, చిన్ని కృష్ణారావు, బొమ్మ రాజేశ్వరరావు, పోట్ల శ్రీదేవీ శ్రీకాంత్, వల్లభనేని రామారావు, బత్తుల మురళి, బొడేపుడి నాగేశ్వరరావు, బండి కిశోర్, నంబూరి మురళి, నున్నా అప్పారావు, కిలారు బాబ్జీ, పోట్ల రాధిక, వంగాల కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మ్యానిఫెస్టో అద్భుతం

- అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళిక
- ఆత్మీయ సమావేశంలో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు





ఎంపీ నామాను సత్కరిస్తున్న రిటైర్డ్ ఇంజినీర్లు, ఉద్యోగులు; ఖమ్మంలో రమేశ్‌నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నామా నాగేశ్వరరావు

ఖమ్మం, అక్టోబర్ 16: బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో అద్భుతమని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల సర్వతో ముఖాభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికను రూపొందిందని అన్నారు. ఖమ్మంలో ఆడిటర్ శివరామకృష్ణ ఇంటి వద్ద సోమవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ద్వారా మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు కర్నాటి కృష్ణ, కేఎస్ బాబ్జీ, బత్తుల మురళీ, పారా నాగేశ్వరరావు, దుద్దుకూరి సత్యనారాయణ, పుతుంబాక నరేశ్, వల్లభనేని రామారావు, మోరంపూడి ప్రసాద్, గొడ్డేటి మాధవరావు, వాకదాని కోటేశ్వరరావు, చీకటి రాంబాబు, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**రిటైర్డ్ ఉద్యోగుల సన్మానం..**

ఖమ్మం టీఎస్ జెన్కో రిటైర్డ్ ఏడీఈ మధుసూదన్‌రావు ఇంటి వద్ద కేటీపీఎస్ రిటైర్డ్ ఇంజినీర్లు, ఉద్యోగులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎంపీ నామా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ నామాను వారు సన్మానించారు. ఈ సమావేశంలో యూనియన్ బాధ్యులు మధుసూధన్‌రావు, ఈశ్వరయ్య, వీరభద్రం, నిరంజన్‌రెడ్డి, సత్యనారాయణ, బాపయ్య, కోటేశ్వరరావు, బాబు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

ఖమ్మం నగరంలో సోమవారం పర్యటించిన ఎంపీ నామా.. పలు డివిజన్లలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. నల్లమల పూర్ణచందర్‌రావు ఇంటికి వెళ్లి ఆయన సతీమణి లలిత చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రిటైర్డ్ ఫారెస్ట్ రేంజర్ మూలగండ్ల వెంకటేశ్వరరావు కుమారుడు రమేశ్‌నాయుడుమృతి చెందగా.. వారింటికి వెళ్లి రమేశ్‌నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపాలెం, కోయచలక ఫీడర్లలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రఘునాథపాలెం, అక్టోబర్ 16: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రఘునాథపాలెం, కోయచలక, ఇండస్ట్రియల్ ఏరియా ఫీడర్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ సంజీవ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8:30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రఘునాథపాలెం, కోయచలక, రేగులచలక, ప్రగతిమైదాన్, దారేడు, శివాయిగూడెం, పువ్వాడ నగర్, కేసీఆర్, కేటీఆర్ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.